
# ఫ్లాష్ బ్యాక్




పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి  అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## నేపథ్యనిపుణులు

## జయరామరెడ్డి

*(1968 ఆగస్టు విజయచిత్ర నుంచీ పునర్ముద్రణ)*



**చిత్రనిర్మాణంలో పెయింటింగ్** శాఖ ఆవశ్యకత ఎంతో వుంది. నిజానికి పెయింటింగ్ శాఖ లేకపోతే చిత్ర నిర్మాణమే వుండదు. దృశ్యంలోకి చిన్న కర్రముక్క కావల్సివచ్చినా దానికి కూడా సరైన రంగు పుయ్యనిదే కెమెరాకు పనికిరాదు. అందుకే చిత్రం రమ్యంగా వుండాలంటే అందుకు పెయింటింగ్ శాఖవారి సహకారం ఎంతో అవసరం.

దర్శకుడూ, కళాదర్శకుడూ కలిసి చిత్రానికి సంబంధించిన సెట్టును రూపకల్పన చేసుకుంటారు. దాని ప్రకారం కళాదర్శకుడు ఆ సెట్టుకు సంబంధించిన రేఖా చిత్రాన్ని గీస్తాడు. అక్కడనుంచీ పెయింటింగ్ శాఖవారితో అవసరం కలుగుతుంది. కళాదర్శకుడు సెట్టులో చిత్రానికి సంబంధించిన ఏఏ దృశ్యాలు చిత్రించాలో పెయింటింగ్ శాఖ అధికారితో చెబుతాడు. ఆ తరవాత చాయాగ్రహకుడు ఏఏ రంగులను ఉపయోగిస్తే కెమెరాకు బావుంటుందో వివరిస్తాడు. వారిరువురి సూచనలనూ అనుసరించి

పెయింటింగ్ శాఖ అధికారి తన బాధ్యతను నిర్వహిస్తాడు.

కొన్ని చిత్రాలలో 'మీనియేచర్ షాట్స్'వుంటూ వుంటాయి. అంటే ఓ పెద్ద భవంతో పర్వతమో తియ్యవలసిన అవసరం వున్నప్పుడు అంత పెద్దవిగా వాటిని నిరించడం కష్టం గనక, వాటిని చిన్నవిగా నిర్మించి కెమెరాను వాటి దగ్గర వుంచి తీసి, చిత్రంలో అవే ఎంతో పెద్దవిగా వున్నట్టు చూపిస్తారు. ఇందుకు కళా దర్శకుడు చెప్పిన విధంగా 'మీనియేచర్' తయారవుతుంది. దానికి కావలసిన రంగులు వేసి దానిని కావలసిన విధంగా తయారు చేస్తారు. పెయింటింగ్ శాఖవారు. ఇందులో వారి నేర్పు ఎంతైనా అవసరం. వారి పనిగనక బాగోలేకపోతే ఆ 'షాటు' అందమే చెడిపోయే ప్రమాదం వుంది.

'ప్రమీలార్జునీయం' చిత్రంలో ఒక పెద్ద కోటగోడ మీద పహరా తిరుగుతున్న దృశ్య చిత్రీకరణ వుంది. అంత పెద్ద గోడను నిర్మించడం కష్టం గనక పెయింటింగ్ శాఖవారు చిత్రించిన ఒక చిన్న గోడ ఆకారాన్ని తీసుకుని దానితో పహరా సీనును కలిపి చిత్రంలో పెద్ద గోడమీద పహరా తిరుగుతున్నట్టు చూపించబడింది. అలాగే 'చిక్కడూ దొరకడూ'లో నాయకుడు గుర్రం మీద పోతూ ఒక కొండమీంచి మరో కొండమీదకి దూకే దృశ్యం, 'జగదేక వీరుని కథ'లో నాయకుడు పర్వతమీదనుంచి క్రిందకు దూకే ఘట్టం ఇవన్నీ ఈ విధంగా చిత్రీకరింపబడినవే.

అలా చిత్రింపజేసిన వ్యక్తి, జయరామరెడ్డి. జయరామరెడ్డి వాహినీ స్టూడియో పెయింటింగ్ శాఖలో దాదాపు పదిహేను సంవత్సరాలు అనుభవం వున్న వ్యక్తి. దాదాపు నాలుగువందల చిత్రాలకు పైగా పని చేశారు. నలుగురు ఆర్టిస్టులూ, ముప్పైఆరుమంది బాక్‌గ్రౌండ్ పెయింటర్సూ ఆయన శాఖలో, ఆయన ఆధ్వర్యంలో పని చేస్తున్నారు.

జయరామరెడ్డి స్వగ్రామం నెల్లూరు జిల్లాకు చెందిన ముత్తుకూరు గ్రామం. ఆయన ఓ రైతు కుటుంబంలో పుట్టాడు. అయితే చిన్నప్పటినుంచి చిత్రకళలో అభిరుచి వుండేది. స్కూల్లో చదువుకుంటూ వుండేటప్పుడు అతను రచించిన చిత్రాలకు బహుమతులు కూడా వచ్చాయి. ఆ విధంగా తన అభిరుచికి ప్రోత్సాహం లభించడంతో మరింత ఉత్సాహంతో చిత్రకళలో కృషి చెయ్యసాగాడు. అందుకు వాళ్ళ నాన్నగారు కూడా దోహద మిచ్చారు.

జయరామరెడ్డి చిన్నాన్నగారు అబ్బాయి అభిలాషని గుర్తించి అతనిని ఆ త్రోవలోనే పెట్టడం మంచిదని భావించారు. నెల్లురులో యస్సెసల్సీ వరకూ చదువుకున్న రెడ్డిని వెంట పెట్టుకుని మద్రాసు వచ్చి వాహినీ స్టూడియోలో పెయింటింగ్ శాఖలో చేర్పించారు. మొదట చేరినప్పుడు ఆయన బాక్‌గ్రౌండ్ పెయింటరుగా చేరాడు. ఆ హోదాలో ఆరునెలలు వున్నాడు. ఆ తరవాత మూడు సంవత్సరాలపాటు అప్పటి పెయింటింగ్ శాఖ అధికారి అయిన కె.యస్.యన్ మూర్తిగారికి ప్రధమ సహాయకుడిగా పనిచేశాడు.

మామూలు చిత్రలేఖనానికీ సినిమా పనికీ ఎంతో వ్యత్యాసం వున్నట్టు తెలుసుకున్నాడు జయరామరెడ్డి. ఈ రంగంలో ప్రవేశించిన వెంటనే. ఈ రంగంలోని మెళకువలు తెలుసుకోవడానికి తీవ్రంగా కృషి చేశాడు. సెట్సుకు దృశ్య

చిత్రీకరణ ఎలా చేయిస్తున్నారో గమనించసాగాడు. అదే దృశ్యాన్ని తను ఇంట్లో కూర్చుని చిత్రించడానికి యత్నించేవాడు. కొద్దికాలంలోనే సత్ఫలితాన్ని సాధించగలిగాడు.

మాధవపెద్ది గోఖలేగారు జయరామరెడ్డికి అనేక విషయాలను నేర్పారు. తను కళాదర్శకత్వం వహించే చిత్రం వచ్చినప్పుడల్లా తను దగ్గరుండి పెయింటింగ్ చేసే విధానం అతనికి నేర్పుతూ వుండేవారు. "వారివద్ద నేర్చుకున్న పరిజ్ఞానంతోనే నేనీనాడూ ఈ స్థితిలో వుండగలిగాను" అన్నారు జయరామరెడ్డి.

"సెట్టు నిర్మాణం అందంగా వుండడానికి కళాదర్శకుడి, ఛాయాగ్రాహకుడి, పెయింటింగ్ శాఖవారి సహకారం అవసరం ఈ ముగ్గురూ సహకరిస్తే సెట్టును ఎంతో అందంగా చెయ్యవచ్చు. చిత్రీకరణకు ఎంతో పుష్టిని చేకూర్చవచ్చు. మన చిత్రాలు చూసే జనాభా తక్కువ. అందుచేత మన నిర్మాతలు ఏ విషయంలోనైనా సరే పొదుపుగా వుండవలసి వస్తుంది.

అందుకే మేము నిర్మాతల స్తోమతను బట్టి రంగులను వాడుతూవుంటాము. ఖరీదైన రంగులను వాడితే మంచి ఫలితాలను తేవచ్చు. మేము సాధారణంగా నలుపు తెలుపు చిత్రాలకు వాటర్ కలర్స్‌ను వాడతాము. వీటి ఖరీదు చాలా ఎక్కువ. అయితే రంగులు నిర్దుష్టంగా కనిపిస్తాయి. కాంతి వీటిమీద పడినప్పుడు ప్రతిబింబించదు. కానీ ఇవి ఖరీదు ఎక్కువ కావటంతో ఎక్కువ వ్యయంతో తీసే వర్ణ చిత్రాలకు మాత్రమే వీటిని వాడతాము. వర్ణ చిత్రాలకు కూడా కొందరు 'వాటర్ కలర్స్' వాడమంటారు. వారి స్తోమత కనుగుణ్యంగా అలాగే చౌకలో తేల్చి వేస్తాము.

అయితే మా దృష్టిలో, మా పనిలో వర్ణ చిత్రాలకీ, నలుపు తెలుపుల చిత్రానికీ పెద్ద తేడాలేదు. ఎందుకంటే మాములు చిత్రానికి కూడా కొందరు ఛాయాగ్రాహకులు అన్ని రంగులనూ వెయ్యమంటారు. మరి కొందరు కేవలం నలుపు తెలుపులలోనే ఆ ఎఫెక్టు తీసుకురావలంటారు. వారి వారి అలవాటులకు అనుగుణ్యంగా మేం నడుచుకుంటూ వుంటాము" అని చెప్పారు పెయింటింగ్ శాఖాధికారి జయరామరెడ్డి.

Post your comments